



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 11వ భాగం

ఫ్రాన్సు నుండి వచ్చిన దగ్గర నుండి మార్క్స్, జెన్నిలకు ఆరోగ్యాలు దిగజారడం మొదలయ్యాయి. డాక్టర్లు ఇద్దరినీ వేరు వేరు గదుల్లో వుంచి తనిఖీలు చేసేవారు. కొన్ని వారాలైతే, మార్క్స్ని, జెన్నీ వున్న గదిలోకి వెళ్ళవద్దని ఆంక్షలు విధించారు. అలా 1881 నవంబర్ వచ్చింది. ఆ నెల చివరిలో బ్రిటీష్ వార్తా పత్రికల వాళ్ళు "లీడర్స్ ఆఫ్ మోడరన్ థాట్"అని ఒక వ్యాసాన్ని రాస్తూ, దాంట్లో కార్ల్ మార్క్స్ గురించి, చాలా ప్రముఖంగా ప్రస్తావించారు. మార్క్స్, 1881నవంబర్ 3౦ న ఆ వార్త జెన్నీకి చదివి వినిపించాడు. సహజంగానే జెన్నీ చాలా ఆనంద పడింది. మార్క్స్ చేతులు నిమురుతూ కళ్ళలోకి ప్రేమగా చూసింది. అలా భర్త గురించి ప్రముఖంగా రాశారని,ఈ లోకం నుండి నిష్క్రమించ బోయే ముందు జెన్నీ కి లభించిన చిన్న ఆనందం అది. అది జరిగిన రెండు రోజులకి 1881 డిసెంబర్ 2 న జెన్నీ కేన్సర్ వ్యాధికి లొంగిపోయింది. తన 67 ఏళ్ళ వయసులో భర్త దగ్గర ఉండగానే కన్ను మూసింది. మార్క్స్ జీవితంలో ఒక అధ్యాయం ముగిసింది.

ఒక్కసారి ఈ అధ్యాయాన్ని పునశ్చరణ చేసుకుందాం. ఇంత వరకూ మార్క్స్ భార్యని జెన్నీఅని పిలుచుకున్నాం కదా! ఆమె పూర్తి పేరు."జోయానా బెర్తా జూలీ జెన్ని వాన్ వెస్ట్ ఫాలెన్" చాలా ధనవంతులైన కుటుంబంలో పుట్టింది.

చాలా గారాబంగా, కాలు కింద పెట్టకుండా పెరిగింది. “అద్భుత సౌందర్య రాశి” అని అందరి చేతా పొగడ్తలందుకుంది. తనకంటే నాలుగు సంవత్సరాలైన కార్ల్ మార్క్స్ను ప్రేమించింది. కార్ల్ మార్క్స్ లో ఏం చూసి ప్రేమించింది? కేవలం అతని మేధస్సు చూసి, ఎప్పటికైనా ప్రపంచాన్ని మార్చే సిద్దాంత కర్త అవుతాడనే విశ్వాసం. మార్క్స్ ఇంకా విద్యార్ధి దశలో ఉండగానే, అంత గట్టి నమ్మకం. అందుకనే నిశ్చితార్ధం జరిగాక 7 సంవత్సరాల పాటు నిరీక్షించి, పెళ్లి చేసుకుంది. ఆ క్షణం నుండి చివరి క్షణం వరకూ అత్యంత ఆత్మీయమైన, విశ్వనీయమైన సహచరిగా జీవించింది.

కష్టాలూ, బాధలూ, భరించలేని పేదరికం, దేశం నుండి దేశానికి ప్రవాసం, సరైన పోషకాహారం లేక, పిట్టల్లా రాలిపోయిన నలుగురు పిల్లలు. పసిపాప శవ పేటిక కొనడానికి రెండు పౌండ్లు లేక, మార్క్స్ కు కూడా ఎక్కడ అప్పు దొరక్కపోతే, తన మిత్రులను బ్రతిమిలాడి ఆ 2 పౌండ్లూ తెచ్చి,పాప శవాన్ని శ్మశానానికి పంపించినటువంటి దయనీయసంఘటనలు కూడా చూసింది జెన్నీ. వరసగా పిల్లలు పుట్టడం తో, దిగజారిపోయిన తన ఆరోగ్యం,మశూచీ, వినికిడి సమస్య, డిప్రెషన్ ఎన్ని జరిగినా గానీ...

”ఎందుకయ్యా! ఈ జీవితం. ఎవరి కోసం నిన్ను నీవు బలిచేసుకుంటూ, మమ్మల్ని కూడా బలి చేస్తున్నావు. పద మన వూరు వెళ్ళిపోదాం. మీ అమ్మా..మా అమ్మా..సహాయం చేయడానికి సిద్దంగా వున్నారు. పిల్లల కోసమైనా రాజీ పడదాం “ అని ఒక్కసారంటే, ఒక్కసారి కూడా అనలేదు. అంతేనా...? తను కూడా అనుకోలేదు. భర్త రాస్తున్న ఆర్ధిక, సామాజిక విశ్లేషణల్ని ప్రపంచం అర్ధం చేసుకున్నటు వంటి రోజు కోసమని జెన్నీ నిరంతరం నిరీక్షించింది. ఒక పక్క పిల్లల్ని చూసుకుంటూ, చాలా సంవత్సరాలు భర్త వ్యాసాలను ఫెయిర్ చేస్తూ, సెక్రటరీ గా పనిచేసింది. ఇంట్లో పనిమనిషి తల్లి అయినప్పుడు, ఎంగెల్సు తనే ఆ బిడ్డకు తండ్రిని అని ప్రకటించినప్పటికీ సాటిలేని సంయమనాన్ని పాటించింది. ఇక పిల్లల విషయానికి వస్తే, కనీసం పెళ్ళయిన తర్వాతయినా సుఖంగా ఉంటారని ఆశించింది. అప్పుడు కూడా వాళ్ళు సుఖంగా బ్రతకలేక పోవడం చూసి, నిస్సహాయంగా నిట్టూర్చింది.

చిట్ట చివరి జీవితపు చివరి సంవత్సరాలలో ‘కేన్సర్‘ పోరాడి, పోరాడి అలసిపోయి, శాశ్వతంగా ఈ లోకం నుండి నిష్క్రమించింది. కార్ల్ మార్క్స్ పక్కన ఉండగానే, జెన్నీ చేసిన ఈ త్యాగాలన్నీ గ్రంధస్తం కాక పోవచ్చు. కానీ, జెన్నీలేని మార్క్స్ ను ఊహించుకోలేం. ఒక్కసారి మనం వెనక్కి వెళ్లి, ఇంత వరకూ చదివిన కధంతా పునరాలోకనం చేసుకుంటే, జెన్నీ యొక్క ప్రభావం మార్క్స్ మీద యెంత వుందో అర్ధమవుతుంది. జెన్నీ లేకుండా మార్క్స్ ఇన్నిసాధించే వాడా అంటే, “లేదు అని చెప్పడానికి ఏమీ సందేహించవలసిన అవసరం లేదు.” అని ఆయన సన్నిహితులందరూ ఏకగ్రీవంగా అంగీకరించిన వాస్తవం. ఒక విధంగా చెప్పాలంటే, జెన్నీ చేసింది త్యాగం కాదు, ఆత్మ త్యాగం అనవచ్చు.

జెన్నీని లండన్ ‘హైగేట్ ‘శ్మశాన వాటికలో సమాధి చేశారు. అప్పటికి 4,5 సంవత్సరాలక్రితం పెద్ద మనవడిని కూడా అక్కడే సమాధి చేశారు. భార్య యొక్క పార్ధివ దేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్ళే అంతిమ యాత్రలో మార్క్స్

పాల్గొనలేదు. అంత్యక్రియలకు కూడా వెళ్ళలేదు. చనిపోవడానికి 2,3రోజుల ముందు జెన్నీ, నర్సుతో చెప్పిందట.''మేము ఇద్దరమూ వేరేవేరే లోకాల్లో ఉన్నప్పటికీ, కలిసే వుంటాము "అని. మార్క్స్ వెళ్లకపోవడానికి మరొక కారణం ఏమిటంటే, అది డిసెంబర్ నెల. గడ్డ కట్టే చలి. ఆయనేమో మంచం మీదనుండి లేవలేని స్థితిలో వున్నాడు. అయినా సరే! "వస్తాననే" అన్నాడు. కానీ, జెన్నీ మృతదేహాన్ని చూసి తట్టుకోగలడో, లేదోనని భయపడి "రావద్దని" అన్నారు మిత్రులు.

అంత్యక్రియల్లో ఎంగెల్సు జెన్నీ గురించి ఒక స్మృతి సందేశాన్ని చదివాడు.''ఈ మహిళ మేధస్సూ, ఈ మహిళ త్యాగాలూ చాలామంది కి తెలియకపోవచ్చు. మార్క్స్ మరో ప్రపంచం ఏర్పడిన రోజున,అందులో జెన్నీకి భాగస్వామ్యం వుంటుంది అన్న విషయం మనం మరచిపోకూడదు.''అని . ఆ తర్వాత ఎంగెల్సు, ఒక మిత్రుడికి వుత్తరం రాస్తూ..''జెన్నీ చనిపోయింది. మార్క్స్ బ్రతికి వున్నాడు గానీ, చనిపోయినట్లు గానే వున్నాడు. ఆయన భౌతిక దేహం లో జీవం ఏ మాత్రం లేదు.''అని రాశాడు.

1882 వ సంవత్సరం వచ్చింది. 38 ఏళ్ళ జీవన సహచరి వెళ్ళిపోయింది. మార్క్స్ జీవితంలో నుండి, కళా, కాంతీ, చురుకుదనం, ఆలోచనా శక్తీ..ఇవన్నీ కూడా సహజం గానే నెమ్మది నెమ్మదిగా పక్కకి తప్పుకొంటున్నాయి. దగ్గరలో వున్న ఇద్దరి కూతుర్లూ, ఎంగెల్సూ, హెలెనూ అందరూ కూడా మార్క్స్ ని జాగ్రత్తగానే చూసుకుంటున్నారు. అయినప్పటికీ మార్క్స్ ఒంటరి వాడై పోయాడు. కొన్ని సార్లు వాకింగు కి వెళుతుండేవాడు. పాత కోటూ, పాత టోపీ, చేతిలోకర్ర పట్టుకొని వెళుతున్నప్పుడు కూడా ఏదో ఆలోచిస్తూ, దిగులుగా ఉండేవాడు. ఎక్కడికి వెళ్ళాలో కూడా తెలియదు.4,5 వీధులు తిరిగి మళ్ళీ వెనక్కి వస్తూ, ఇల్లు కూడా మరచిపోయేవాడు. చేతిలో వున్న తాళంతో వేరే ఇంటికి వెళ్లి, తాళం తీయడానికి ప్రయత్నించేవాడు. అది రాకపోతే, అప్పుడు.. 'ఓహో!ఇది నా ఇల్లు కాదా?" అని అప్పుడు పక్కనేవున్న తన ఇంటికి వెళ్ళేవాడు. ఇలా జరగడం మామూలైపోయింది.

ఇంకా ఆరోగ్యం. అది ఎప్పటి నుండో బాగా లేదు కదా! రోజు రోజుకీ శరీరం మీద పెరుగుతున్నటువంటి కురుపులు నివారణకు డాక్టర్లు ఏం చెప్పారంటే..''కురుపులు బాగా పెరిగిపోయాయి. మందులకు తగ్గడం లేదు.అందుకని అయోడిన్ రాయండి.''అని చెప్పారు. అది రాసేసరికి శరీరం అంతా మంటల్లో మండుతున్నట్లుగా వుండేది. దాంతో, సహజంగానే కోపం విపరీతంగా వచ్చేది. ఒక విధంగా అది మంచిదే అయ్యింది. ఎందుకంటే, ఈ శారీరక బాధ, అతని మానసిక వ్యధను మరచిపోయేటట్లుగా చేసింది కనీసం కొంత కాలమైనా. ఇంత బాధ పడుతున్నా గానీ, భార్య లేని తనం, ఒంటరి తనం, అనారోగ్యం, ఎలా వున్నా, ఆయన ఎప్పుడో ప్రారంభించిన గ్రంథ రచనను మాత్రం మరచిపోలేదు. ఇలా యెంత కాలం ఉంటానో,తొందరగా ఆ కేపిటల్–2పూర్తి చేసి,ప్రచురణకు ఇచ్చేద్దామని అనుకున్నాడు. మరొక కారణం ఏమిటంటే, దాన్ని భార్య జెన్నీకి అంకితమిద్దామని అనుకున్నాడు.

జర్మనీ లోని గతంలో తన పుస్తకాన్ని పబ్లిష్ చేసిన పబ్లిషర్ కి రాశాడు. "ఈ కేపిటల్–2 ని కూడా తొందరగా వేసుకోండి." అని. అయితే, ఆ పబ్లిషర్ నుండి యేమని సమాధానం వచ్చిందంటే, కేపిటల్–2 ని తరవాత వేద్దాం. ముందు కేపిటల్–1 మళ్ళీ 3 వ ముద్రణకు వచ్చింది. దానికి చాలా గిరాకీ వుంది.అందుకని, కేపిటల్–1కే కొత్తగా ఉపోద్ఘాతం, మార్పులూ, చేర్పులూ చేస్తే, చేసి పంపించండి. అదయిపోయాక, అప్పుడు కేపిటల్–2 గురించి ఆలోచిద్దాం " అని. కానీ, మార్క్స్ అప్పుడు వున్న పరిస్థితిలో కేపిటల్–1 మళ్ళీ చదివి, దాన్ని దిద్దీ, దాంట్లో మళ్ళీ మార్పులు చేసేటంత ఓపిక లేదు. ఆసక్తి కూడా లేదు. యేవో చిన్న చిన్న సవరణలు చేసేసి, "ప్రస్తుతానికి ఇంత కంటే ఏమీ చేయలేను."అని పబ్లిషర్ కి చెప్పేశాడు.

"మార్క్స్ ఆరోగ్యం కాస్త మెరుగుపడాలంటే, స్థలం మార్పిడి అవసరం" అని డాక్టర్లు చెప్పారు. ఆయన్ని ప్రధానంగా చూసుకునేది ఎంగెల్సే కదా! అతను డాక్టర్ల తో సంప్రదించి, ఉత్తర ఆఫ్రికా లోని, అల్జీరియాలో ఒక రిసార్ట్ లో 1,2 నెలల పాటు వుంటే బాగుంటుందని భావించి ఆ ఏర్పాట్లు చేశాడు. ఎందుకంటే, అది సముద్రతీర ప్రాంతం. లండన్ వాతావరణానికి చాలా భిన్నంగా వుంటుంది. హెలెన్ తోడుగా మార్క్స్‌ను అల్జీరియా పంపించాడు. అక్కడ వుండగా మార్క్స్ తన గెడ్డాన్నీ, జుత్తునీ బాగా తగ్గించేసుకున్నాడు. అలా, ఆయన్ని చూసిన ఆయన అభిమానులు అనుకునేవారట "ఈయన చల్లారిపోయిన అగ్నిపర్వతంలాగ ఉన్నాడు "అని. ఇప్పుడు మనం చూస్తున్న మార్క్స్ ఫోటోలన్నీ పెద్ద గెడ్డం, జుత్తుతో, మనిషి లోపల అగ్నిజ్వాలలు రేపుతున్నట్లుగా వుంటుంది. అదంతా తీసేసి, క్రాఫ్ తీసేసినటు వంటి స్థితిలో ఫోటో మనకు ఎక్కడా లభ్యం కాలేదు.

లండన్ నుండి అల్జీరియా వెళ్ళాలంటే, ఫ్రాన్సు మీదుగా వెళ్ళాలి. మరి ఫ్రాన్సులో మార్క్స్ పెద్దమ్మాయి వుంది కదా! అందుకని వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ ఫ్రాన్సులో దిగారు. హెలెన్ సహాయం ఎలాగూ వుంది. క్రితం సంవత్సరం భార్య తో కలసి వెళ్ళాడు. ఇప్పుడైతే ఒక్కడే. చెన్ కాపరం చూసి "తాము లండన్ వచ్చే కొత్తలో ఎన్ని ఇబ్బందులు పడ్డారో, అవన్నీ కూడా గుర్తుకు వచ్చి, అవన్నీ కూడా చెన్ పడుతున్నది" అనుకున్నాడు. అప్పటికి నలుగురు పిల్లలూ, ఆర్థిక ఇబ్బందులూ, ఇంటి అద్దె బకాయిలూ, ఇంటి ఓనరు వేధింపులూ, సరిగ్గా అన్నీ అచ్చం గతం లాగే.

అన్నీ చూశాడు. కానీ, ఏమీ చెయ్యలేడు. తన పరిస్థితే అటూ, ఇటూగా వుంది. లండన్ వెళ్ళిన తర్వాత రెండో అమ్మాయి లారా ని పిలిచి "అక్క పరిస్థితి ఏమీ బాగాలేదు. మీరు ఎప్పటినుండో ఫ్రాన్సు వెళ్దామని అనుకుంటున్నారు కదా! మీరు వెళ్తే, కాస్త తోడుగా వుంటారు." అని లారా, పాల్ లకు చెప్పాడు. వాళ్ళు కూడా దాదాపుగా ఏడాదిన్నరగా 'ఎప్పుడు ఫ్రాన్సు వెళదామా' అని ఆలోచిస్తున్నారు. ఇదిగో మార్క్స్ ఇలా చెప్పగానే, వాళ్ళు ఫ్రాన్సు వెళ్ళిపోయారు.

అక్కడకు వెళ్ళాక లారా, అక్కకి సహాయం చేయడానికని ఎక్కువగా అక్కదగ్గరే వుంటుండేది. కానీ, వాళ్ళు వెళ్ళేసరికే, చెన్ ఆరోగ్యం చాలా ప్రమాదకరంగా వుంది. "కడుపులో ఏదో ట్యూమర్" వుందని చెప్పారు. మందులు

వాడుతున్నారు. కానీ, ఇంకా దయనీయమైన పరిస్థితి ఏమిటంటే, అంత అనారోగ్యంలో కూడా చెన్ ఆరవసారి తల్లి కాబోతోంది. 1882 సెప్టెంబర్ 16 న తన ఆరవ చివరి సంతానం ఒక పాపకు జన్మనిచ్చింది. చెన్ ఒక వైపు తన అనారోగ్యంతో పోరాడుతోంది. మరో వైపు ఆ పసిపాపను చూసుకోవడంలో మరింత తీరిక లేకుండా అయిపోయింది.

1882 డిసెంబర్ అంటే, అప్పటికి జెన్ని చనిపోయి సంవత్సరం అయింది. మార్క్సును "ఇంట్లో నుండి కదలనివ్వ వద్దు." అని డాక్టర్లు చెప్పారు. రోజూ పొద్దున్నే వచ్చి ఎంగెల్సు వచ్చి,రాత్రి పొద్దుపోయే వరకూ కూర్చొని వెళుతుండేవాడు.

మార్క్స్ అంత అనారోగ్యంలో కూడా బయట ప్రపంచంలో ఎవరికో ఒకరికి స్ఫూర్తిని ఇస్తూనే వున్నాడు. ఇలా ఆయన ఒంటరిగా బాధ పడుతున్న రోజుల్లో ఒక రష్యన్ ఆర్థిక శాస్త్రవేత్త ఒక పుస్తకం రాశాడు. అందులో మార్క్స్ గురించి ప్రస్తావిస్తూ "సోషలిస్ట్ ఆఫ్ మార్క్సియన్ స్కూల్ " అని రాశాడు. అంటే, 'మార్క్స్ యొక్క ఆలోచనా విధానం ఒక స్కూలు లాంటిది' అని అర్థం. మార్క్స్ నీ అతని సిద్దంతాలనూ, ఆలోచనలనూ, ఒక వ్యవస్తలాగా పరిగణించే తరం అప్పటికే మొదలై పోయిందన్నమాట. ఇలాంటివి విన్నప్పుడు సహజంగానే ఆనందించేవాడు మార్క్స్.

అక్కడ ఫ్రాన్సులో ఏమవుతుందో చూద్దాం. రెండో అమ్మాయి లారా వుత్తరం రాసింది. " "అక్క, చెన్ ఆరోగ్యం రోజు రోజుకీ దిగజారుతోంది. నేను యెంత సహాయం చేస్తున్నప్పటికీ, అయిదుగురు పిల్లలూ, ఆర్థిక ఇబ్బందులూ చాలా కష్టంగా ఉంటోంది."అని. ఆ వుత్తరం చూసి మార్క్స్ మరింత దిగులు పడ్డాడు. కాకపోతే, ఆయన కూడా చెయ్యగలిగింది కూడా ఏమీ లేదు. 1882 చివరకు వచ్చేసరికి చెన్ ఆరోగ్యం పూర్తిగా దిగజారింది. మంచానికే అతుక్కుపోయింది. శరీరంలో ఎక్కడో, ఏదో ఒక భాగంలో రక్తస్రావం అవుతోంది. డాక్టర్లకి తెలిసింది కానీ, అదెక్కడో కనిపెట్ట లేకపోయారు. విషయం తెలిసిన మార్క్స్, "ఒక్కసారి వెళ్లి కూతురిని చూసి వస్తా" నని, ఎంగెల్సుతో చెప్పాడు. కానీ, ఆయన ఆరోగ్యం దృష్ట్యా కదల వద్దని డాక్టర్లు చెప్పారు. అందుకని వెళ్ళలేకపోయాడు. పైగా...ఎలాగో కష్టపడి వెళదాం అనుకున్నాగానీ, తన పరిస్థితి చూసి పెద్దమ్మాయికి మరింత ఇబ్బందని అనుకున్నాడో ఏమో గానీ,వెళ్ళలేదు. మార్క్స్ఆరోగ్యం మరీ దిగజారడంతో, డాక్టర్లను అడిగి, లండన్ కి దగ్గరలోనే "ఐ లాఫ్ హైట్ " అని ఒక ద్వీపం వుంది. అక్కడ విశ్రాంతి తీసుకో "అని అక్కడకు పంపించాడు ఎంగెల్సు.

1883 జనవరి 11 వ తేదీ. మార్క్స్ మూడవ కూతురు 'ఎలినార్' ఆ ద్వీపంలో ఉన్నటువంటి తండ్రి దగ్గరకు వెళ్ళింది. లోపలకు వెళ్తూ..."నాన్నా!"అని ఏదో చెప్పబోయింది. అంతలోనే ఆగిపోయింది. మార్క్స్, కూతురి వంక ఒక్కసారి చూశాడు. "నాకు తెలుసమ్మా! అక్క వెళ్ళిపోయింది. అదే కదా, చెప్పబోతున్నావు."అన్నాడు. ఇద్దరూ ఒకరిని ఒకరు ఓదార్చుకున్నారు.

38 సంవత్సరాల 'జెన్నీ చెన్' మార్క్స్ పెద్దకూతురు ఫ్రాన్సులో మరణించింది. ఒక్కసారి ఈ చెన్ జీవితాన్ని కూడా వెనక్కి తిరిగి చూస్తే...ఆడపిల్లలందరిలోకి పెద్దమ్మాయి ఈ చెన్ అంటే, చాలా ఇష్టం మార్క్సుకి. అందుకనే, ఆమె

28 సంవత్సరాల వయసులో “రాజకీయ కార్యకర్తను చేసుకుంటా” నంటే, కూడా “సరే!” నన్నాడు. అలాగే తన నీడ లేకుండా సొంతంగా రాజకీయ కార్యకర్తగా ఎంతో గర్వంగా భావించాడు. చెన్ కి ఆ త్యాగం అనేది తల్లి జెన్నీ నుండి వచ్చినదేమో. చెల్లెలు పెళ్లి చేసుకుని వెళ్ళిపోగానే, ఇంటింటికీ వెళ్లి ట్యూషన్లు చెప్పి ఎంతో కొంత సంపాదిస్తుండేది. భర్తకు వుద్యోగం లేనపుడు కూడా ట్యూషన్లు చెప్పేది. ఆరుగురు సంతానం పుడితే, పెద్ద కొడుకు సంవత్సరానికే మరణించాడు. ఇంకో కొడుకు కొడుకేమో మానసికంగా ఎదగలేదు. అంటే, 28 సంవత్సరాల వయసులో వివాహం చేసుకుంటే, ఆ తరువాత పది సంవత్సరాలలో ఆరుగురికి జన్మనిచ్చింది.కష్టాలూ, బాధలూ, కన్నీళ్ళూ, అప్పులూ, పేదరికం అన్నీ అమ్మా, నాన్నలకు జరిగినట్టే తన కాపరంలో జరిగాయి.

మార్క్స్ వెళ్ళలేకపోయాడు. ఎంగెల్సూ, ఎలినార్ మాత్రం ఫ్రాన్సు వెళ్లారు. మార్క్స్ మాత్రం మౌనంగానే మనసులో నివాళులు అర్పించాడు. చాలా మంది మిత్రులు మార్క్సుకు సానుభూతిని తెలియజేస్తూ ఉత్తరాలు రాశారు. గతంలో భార్య చనిపోయినపుడు అందరికీ సమాధానాలు ఇచ్చాడు. ఇప్పుడు ఉన్నటు వంటి ఈ పరిస్థితిలో ఎవరికీ ఎటువంటి సమాధానాలు ఇవ్వలేకపోయాడు. అదే విషయాన్ని ఎంగెల్సు వాళ్ళందరికీ సమాధానాలు ఇస్తూ..”మీరందరూ సమాధానాలు రాయలేదని ఏమీ అనుకోకండి. ఆయన పరిస్థితి అలా వుంది. ఏడాది క్రితం భార్యా, ఇప్పుడు కూతురూ. చాలా దిగులుగా వున్నాడు ” అని అందరికీ రాశాడు.

ఇక ఫ్రాన్సులో  చెన్ ఇంటి సంగతి. చెన్ ఇంట్లో 5 గురు పిల్లలు వున్నారు కదా! అందులో ఒక పాపకు 4 నెలల వయసు. అక్కడకు వెళ్ళిన ఎలినార్, మానసికంగా ఎదుగుదల లేని,  ‘హేరీ' పేరు గల 4 ఏళ్ళ పిల్లవాడ్ని తన దగ్గరే ఉంచుకుందామని, తనతోపాటు లండన్ తీసుకువచ్చేసింది. అలాగే, చెన్ పిల్లల్లో ఒకతను ‘జానీ'ని లారా తీసుకువెళ్ళి తను పెంచుకుంది. మిగతా ముగ్గురు పిల్లల్నీ చెన్ అత్తగారు అంటే, చార్లెస్ అమ్మ గారు తీసుకున్నారు.

ఒక్క సంవత్సరంలో భార్యా, పెద్దకూతురూ మరణించడంతో మార్క్స్ పరిస్థితి ఎలా వుంటుందో మనం ఊహించుకోవచ్చు. బాగా దిగజారింది. పూర్తిగా రెక్కలు తెగిన పక్షి లాగ అయిపోయాడు. దేని మీదా ఆసక్తి లేదు. ఎప్పుడన్నా కాస్త లేవగలిగితే ఏదన్నా పోయట్రీ పుస్తకమో, నవలో చదువుతుండేవాడు. మరి అప్పటికే కొనసాగుతున్న వ్యాధులు వున్నాయి కదా! వాటితోపాటు కొత్త వ్యాధి ఒకటి బయలుదేరింది. అది ఊపిరితిత్తుల సమస్య. శ్వాస తీసుకోవడం చాలా కష్టంగా వుంది. హెలెన్ ఎలాగూ సేవచేయడానికి వుంది. ఆమె ఏది అడిగితే అది చేసి పెట్టేది. అతను అడగకుండానే రకరకాల ఆహార పదార్థాలు చేసి పెట్టేది కానీ, మార్క్స్ కి తిండి మీద ఆసక్తి పోయింది. ఒక అరగ్లాసు పాలు మాత్రం తాగేవాడు. కొంచెం రమ్ము గానీ, బ్రాందీ గానీ తీసుకునేవాడు. పక్కనే ఎంగెల్సు వున్నాడు కదా! రోజూ మధ్యాహ్నం వచ్చి, రాత్రి వరకూ అక్కడే ఉండేవాడు.  ఎంగెల్సు ఓ  మిత్రుడు కి ఒక వుత్తరం రాశాడు “రోజూ నేను

మార్క్స్ ఇంటికి వెళ్తాను. కానీ, ఆయన ఇంటికి వెళ్ళేటప్పుడు సందు మలుపు తిరగ్గానే ఏదో అపశకునం లాగ అనిపించేది. ఇంటి ముందు ఏ రోజైనా విషాద ఛాయలు కనిపిస్తాయేమోనని భయంగా వుంది."అని రాశాడు.

కానీ, యెంత భయపడ్డా, యెంత కాదనుకున్నా ప్రతి మనిషి జీవితంలోనూ తప్పనిసరిగా వచ్చే రోజు ఒకటి వుంటుంది కదా! ఆ రోజు కార్ల్ మార్క్సకి 1883 మార్చి 14న వచ్చింది. ఆ రోజు మధ్యాన్నం రెండున్నర గంటల ప్రాంతంలో ఎప్పటిలాగే ఎంగెల్సు, మార్క్స ఇంటికి వెళ్ళాడు. తలుపు తీసింది హెలెన్. తలుపు తీయడం తోటే, ఆమె ముఖంలో ఆందోళనా, కళ్ళ లో నీళ్ళూ కనిపించాయి.

"నాకేదో భయం గా వుంది. కుర్చీలో కూర్చొని కలత నిద్ర పోతున్నాడు. అపుడపుడు ఏదో కలవరిస్తున్నాడు. రండి పైకి వెళదాం." అని ఎంగెల్సుని ,మార్క్స బెడ్ రూము దగ్గరకు తీసుకెళ్ళింది. ఎప్పుడూ పడక కుర్చీలోనే విశ్రాంతి తీసుకుంటుంటాడు. ఆ రోజు కూడా ఎప్పటి లాగే, పడక కుర్చీలోనే పడుకొని వున్నాడు. నిద్రలో వున్నాడు లేపుదామా,వద్దా? అన్నట్లుగా మార్క్స భుజం మీద చెయ్యి వేశాడు. రెండు నిముషాల క్రితం వరకూ కలవరించిన మార్క్స,ఆ కొద్ది క్షణాలలోనే చాలా దూరం వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు. జీవితాంతం శ్రామికుల కోసం ఆలోచించి, పరితపించిన మార్క్స, ఇంకో రెండు నెలల్లో 65 సంవత్సరాలూ నిండుతాయనగా ఇంక ఆగలేను అన్నట్లుగా 64 సంవత్సరాల పది నెలల వయసులో శాశ్వతంగా నిద్రలోకి జారుకున్నాడు. ఎంగెల్సు ఆ సందర్భంలో చెప్పాడు.

"మానవజాతి ఒక విలువైన మేధావిని కోల్పోయి, నిరుపేద అయ్యింది. విలువైన మేధావే కాదు. ప్రధానమైన మేధావి కూడా. ఆయన మొదలు పెట్టిన కార్మిక ఉద్యమం కొనసాగుతుంది.కాకపోతే దాని కేంద్ర బిందువు చెదిరిపోయింది. కార్ల్ మార్క్స కలలు నిజమయ్యే రోజు వస్తుంది. కార్మికరాజ్యం రుజువయ్యే కాలం వస్తుంది."

సోషలిస్ట్ సిద్ధాంత కర్తా, కమ్యునిస్ట్ పితామహుడూ, శ్రామికజన పక్షపాతీ, ఆర్థిక తత్వవేత్తా, ఇలా ఎన్ని విశేషణాలైన కార్ల్ మార్క్స గురించి చెప్పుకున్నప్పటికీ, ప్రాధమికంగా మార్క్స కూడా మనిషే. మామూలు మనిషే. మన లాంటి మనిషే. వ్యక్తిగత జీవితమూ, కుటుంబం, రాగద్వేషాలూ, భావో ద్వేగాలూ, మానవ సంబంధాల్లో వెలుగు నీడలూ అన్నీ వున్నాయి. అన్నీ చూసాం ఇంత వరకూ. మరొక్కసారి మార్క్స జీవితాన్ని సమీక్ష చేస్తే..

ఆయన విద్యార్థిగా వున్నా రోజుల్లోనే "బుద్ధిగా చదువుకొని,వుద్యోగం చేసుకో " అని చెప్పిన తండ్రి మాట వినలేదు.

ఉద్యమాలూ, సిద్ధాంతాలూ మాని , కాస్త సంపాదన వైపు దృష్టి పెట్టి, భార్యా, పిల్లల్ని చూసుకో"అన్న తల్లి మాటా వినలేదు. గుడ్డిగా తననే నమ్ముకున్న భార్యా, మిగిలిన పిల్లలూ. చివరి పది సంవత్సరాలు తప్ప, మిగిలిన జీవితం అంతా పేదరికమే జీవనం అయింది. అయినా గానీ, చలించలేదు. బయట తను తిరిగే రాజకీయ వర్గాల్లో,తన వాదనే నెగ్గాలని నియంత లాగ ఉండేవాడు. కానీ, ఇంటికి వచ్చేసరికి, ప్రేమానురాగాలు కురిపించే భర్తా, తండ్రీ అయ్యేవాడు. తను

ఆశిస్తున్న మార్పూ, తను ఊహిస్తున్న మార్పూ, తను కలలు గన్న మార్పూ, తన జీవిత కాలంలో సాధ్యమా? అనే సంశయం ఇసుమంతైనా లేకుండా, తన చివరి శ్వాసదాకా కార్మిక సంక్షేమం గురించి, సమాజంలోని వర్గ విబేధాల నిర్మూలన గురించే ఆలోచించాడు.

నిజానికి ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే, మార్క్స్ జీవితంలో రాజీ పడడానికి ఎన్నో సందర్భాలూ, ఎన్నో మార్గాలూ వున్నాయి. ఎప్పుడు ఏ క్షణంలో రాజీ పడినా గానీ, వ్యక్తిగతంగా సౌకర్యవంతంగా జీవించేటటు అవకాశాలు వున్నాయి. అన్నిటినీ తిరస్కరించాడు.

“లక్ష్యాన్ని మరవని వాడే చరిత్రలో నిలిచిపోతాడు.” అనే భావానికి తన జీవితమే ఒక ఉదాహరణగా చూపించాడు. ఒక వైపు జెన్నీ, మరొక వైపు హెలెన్, ఇంకొక వైపు ఎంగెల్సు. వీళ్ళందరూ ఇచ్చినటువంటి ధైర్యం, బలం, విశ్వాసం ఇవన్నీ కూడా మార్క్స్ జీవితాంతం కాపాడాయి అనడంలో ఏ మాత్రం సందేహించాల్సిన అవసరం లేదు. మనం ఎక్కడ చూసినా మార్క్స్ గురించే చదువుతాం. మార్క్స్ గురించే మాట్లాడతాం. కానీ, కార్ల్ మార్క్స్ గురించి మాట్లాడుకునే టప్పుడు ఈ ముగ్గురి గురించి కూడా మాట్లాడుకోవాలనే విషయాన్ని ఇంత వరకూ జరిగిన చరిత్ర చూస్తే, తెలుస్తుంది.

కార్ల్ మార్క్స్ మరణించిన మూడు రోజుల తర్వాత 1883 మార్చి 17న అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. సహజంగానే ఎంగెల్సు ముందున్నాడు. మృత దేహాన్ని శవపేటికలో పెట్టేముందు, చొక్కా జేబులో ఏదో వుందని చూశాడు. 3 ఫోటోలు కనిపించాయి. అవి ఎవరివి అంటే, మార్క్స్ తండ్రిదీ, భార్య జెన్నీ దీ, పెద్ద కూతురు జెన్నీ చెన్ దీ. 'ఆ ఫోటోలు ఎప్పుడూ జేబులోనే ఉంచుకునే వాడు మార్క్స్.' అని తెలిసింది. తండ్రి అప్పటికి చనిపోయి 43సంవత్సరాలు అయ్యింది. తండ్రి ఎప్పుడూ కోప్పడేవాడు “ఒరే బాబూ! నిన్ను కోప్పడేది నీ మీద ప్రేమతోటి..జీవితాన్ని సరిగ్గా దిద్దుకో “అని. అయినా గానీ, తండ్రంటే విపరీతమైన ప్రేమ. అందుకే అన్ని దశాబ్దాలుగా తండ్రి ఫోటో జేబులో పెట్టుకున్నాడు.

నిశ్శబ్దంగా ఆ ఫోటోల్ని మార్క్స్ మృత దేహం మీద వుంచి, ఆ తరువాత ఆ మృత దేహాన్ని శవపేటికలో చేర్చారు. శవపేటిక చుట్టూ రెండు యెర్రని రిబ్బన్లు చుట్టారు. జెన్నీనీ, పెద్ద మనవడినీ ఖననం చేసిన ‘హై గేట్’ శ్మశాన వాటిక లోనే అంత్యక్రియలు నిర్వహించారు.

[ఎంగెల్సు,కార్ల్ మార్క్స్ సమాధి వద్ద చేసిన ప్రసంగం మొత్తాన్ని ఇస్తున్నాను.]

మార్చి 14 వ తేదిన, మధ్యాన్నం పావు తక్కువ మూడు గంటలకు, ప్రపంచంలోని మహత్తర ఆలోచనాపరుని ఆలోచన ఆగిపోయింది.ఆయన్ని మహా అయితే రెండే రెండు నిముషాలు విడిచి బయటకు వెళ్లి ఉంటామేమో, కానీ, మేము తిరిగి వచ్చేసరికి ఆయన పడక కుర్చీలో శాంతంగా నిద్రపోతున్నాడు.అయితే, అది శాశ్వత నిద్ర.

ఈ మనిషి మృతి మూలంగా యూరప్, అమెరికాల లోని సమరశీల శ్రామిక వర్గానికీ,చారిత్రక విజ్ఞాన శాస్త్రానికీ అపారమైన నష్టం వాటిల్లింది. ఈ మహాత్ముని మహా ప్రస్థానకారణంగా ఏర్పడిన లోటు జనానికి త్వరలోనే అవగతతమవుతుంది. డార్విన్ ఏ విధంగా నైతే జీవ ప్రకృతి యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో, సరిగ్గా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. భావ జాలం యొక్క అమిత వృద్ధి కారణంగా ఇంత దాకా మరుగున పడిపోయిన ఒక సరళ సత్యాన్ని,రాజకీయాలూ, విజ్ఞాన్ శాస్త్రం,కళలూ, మతం మొదలైన వాటిలో నిమగ్నులవ గలిగేందుకు ముందు మానవ జాతికి అన్న పానాలూ, వాస వస్త్రాలూ అవసరమన్న విషయాన్ని ఆయన కనుగొన్నాడు. కాగా, అత్యవసర జీవనాధార వస్తువుల ఉత్పత్తి,తత్పర్యవసానంగా ఒకానొక యుగంలో లేక ఒకానొక జాతి ప్రజల చేత సాధింపబడిన ఆర్దికాభివృద్ధి స్థాయే,ఆ ప్రజల యొక్క రాజ్య సంస్థలకూ న్యాయ శాస్త్రానికి సంభందించిన భావనలూ, కళలూ చివరకు మతానికి సంబంధించిన భావాలు సైతం క్రమభివృద్ది చెందడానికి పునాది.అందుకని, వీటన్నిటికీ ఈ పునాది దృష్ట్యానే ఇంతవరదాక జరుగుతున్నట్లు,ఇందుకు తలకిందులుగా కాకుండా వివరించాల్సి వుంది.

అయితే,అంత మాత్రమే కాదు. సమకాలీన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, ఈ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్ని శాసించే ప్రత్యేక గతి నియమాన్నికూడా మార్క్స్ కనుగొన్నాడు. అదనపు విలువ ఆవిష్కారంతో ఏ సమస్యను పరిష్కరించే ప్రయత్నం లోనైతే అంతకు పూర్వపు అటు బూర్జువా అర్ధ శాస్త్రజ్ఞుల యొక్క, ఇటు సోషలిస్ట్ విమర్శకులయొక్క అన్వేషణలన్నీ అంధాన్వేషణలుగానే మిగిలిపోయాయో, ఆ సమస్య పై కాంతి ప్రసరింప బడింది.

ఒక జీవితానికి అటువంటి ఆవిష్కరణలు రెండు చాలు.ఒక్క ఆవిష్కరణ చేసే అదృష్టం లభించిన వ్యక్తి సైతం భాగ్యశాలి అని చెప్పవచ్చు. కానీ, కార్ల్ మార్క్స్ తను పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ కూడా –మరి ఆయన చాలా రంగాల్లోనే పరిశోధన జరిపాడు.అలా పరిశోధన జరిపిన ఏ ఒక్క రంగం లోనూ ఆషామాషిగా పైపైన తడిమి విడిచి పెట్టలేదు. గణిత శాస్త్రంతో పాటూ ప్రతి ఒక్క రంగం లోనూ కూడా ఆయన స్వతంత్రమైన ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞాన్ శాస్త్రవేత్త ఆయన. అయితే, విజ్ఞాన శాస్త్ర వేత్తగా ఆయన ఈ రూపం, ఆయన సమగ్ర వ్యకిత్వంలో అర్దాంశం కూడా కాదు. మార్క్స్ కు సంబంధించినంత వరకూ విజ్ఞాన శాస్త్రం చారిత్రకంగా, క్రియాత్మకమైన ఒక శక్తి. ఏ విజ్ఞాన శాస్త్ర సిద్దాంతంలో నైనా ఒక కొత్త ఆవిష్కరణ జరిగితే, ఆచరణలో దాని అన్వయాన్ని గురించి ఆలోచించడం సైతం ఇంకా అసంభవమే అయినా కూడా –దానికి ఆయన మహా సంతోషంగా స్వాగతం పలికేవాడు. కానీ, అదే ఆవిష్కరణ పరిశ్రమల్లోనూ, మొత్తం చారిత్రకాభివృద్ధిలోనూ తక్షణ విప్లవాత్మక మార్పులకు దారి తీసినట్లయితే, ఆయన మరో రకమైన ఆనందానుభూతిని పొందుతుండేవాడు. ఉదాహరణకు విధ్యుచ్ఛక్తి రంగంలో

జరిగిన ఆవిష్కరణల అభివృద్ధి క్రమాన్ని, 'మర్సెల్ దెప్రే' ఇటీవల ఆవిష్కరణలను సైతం మార్క్స్ అత్యంత శ్రద్ధాశక్తులతో గమనించేవాడు.

మార్క్స్ అన్నిటికంటే ముఖ్యంగా విప్లవవాది కావడమే ఇందుకు కారణం. ఏదో రకంగా పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్య సంస్థలనూ కూల్చి వేయడానికి తోడ్పడడం, ఆధునిక శ్రామిక వర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశ్యం. దానికి తన స్థితినీ, అవసరాలనూ గురించిన చైతన్యాన్ని కలిగించి, ఏ పరిస్థితుల్లో దాని విముక్తి సంభవమో తెలియ జెప్పిన మొట్టమొదటి వాడు ఆయనే. పోరాటం జరపడమే ఆయన సహజ గుణం. మరి ఆయన అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యమైనటువంటి ఆవేశంతో, పట్టుదలతో, సాఫల్యంతోఆ పోరాటాన్ని సాగించాడు. "రైనిషేటుంగ్ పత్రికా, 'పదండి ముందుకు' అనే అర్థం వచ్చే జర్మన్ పత్రికా, జర్మన్ బ్రసెల్స్ వార్తాపత్రికా, నూతన రైనిషే డెమోక్రసీ పత్రికా, న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ పత్రికా.ఇలా వివిధ పత్రికల్లో ఆయన చేసిన పని. దీనికి తోడు సమర శీలమైన అనేక చిన్నచిన్న పుస్తకాల రచన,పారిస్, బ్రసెల్సు లండన్ల లోని వివిధ సంఘాల్లో పనిచేసి,చిట్ట చివరి ఆయన సేవల్లోకెల్లా శిఖర ప్రాయమైన 'ఇంటర్ నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ '[i.w.m.a.]సంస్థాపన. అదెంతటి గొప్ప పనంటే,ఈ సంఘ స్థాపకుడు, తను మరేది చెయ్యక పోయినా కూడా , ఈ ఒక్క పనికే సముచితంగా గర్వించ వచ్చు.

మరి వీటన్నిటి పర్యవసానంగానే మార్క్స్ తన కాలంలో అందరికన్నా ఎక్కువగా ద్వేషింప బడ్డాడు. అభాండాలకు గురయ్యాడు.రాజరిక, రిపబ్లిక్ ప్రభుత్వాలు రెండూ కూడా ఆయన్ని తమ తమ దేశాల నుండి బహిష్కరించాయి.బూర్జువాలూ, మిత వాదులైనా, పరమ ప్రజా స్వామ్య వాదులైనా కూడా, మార్క్స్‌పై అభాండాలు కురిపించడంలో ఒకరితో మరొకరు పోటీపడ్డారు.ఇవన్నీ ఏదో సాలె గూడన్నట్లు ఆయన వీటన్నిటినీ తోసి పారేశాడు. వీటిని మనస్సుకు పట్టించుకోలేదు. మరీ తప్పనిసరి అన్నప్పుడు మాత్రమే సమాధానం ఇచ్చేవాడు. మరి ఇప్పుడాయన మన మధ్య లేడు.

సైబీరియా గనులు మొదలుకొని కాలిఫోర్నియా దాకాయూరప్, అమెరికాలలో అన్ని ప్రాంతాలలోను గల లక్షలాది మంది ఆయన విప్లవ వాద కార్మిక సహచరులు ఆయన్ని ప్రేమిస్తున్నారు.ఆయన్ని గౌరవిస్తున్నారు.ఈనాడు ఆయన మృతి పట్ల అశ్రుధారలు కురిపిస్తున్నారు. నేనొక విషయం ధైర్యంగా చెప్పగలను. ఆయనకు పలువురు వ్యతిరేకులు వుండి ఉండవచ్చునేమో గాని, ఆయనకు వ్యక్తిగత శత్రువులు ఒక్కడూ లేడు.

ఆయన పేరు యుగయుగాలుగా వుంటుంది. అలాగే ఆయన కృషి కూడా చిరస్థాయిగా వుంటుంది.

[లండన్ లోని హై గేట్ శ్మశాన వాటికలో 1883 మార్చి 17 వ తేదిన ఎంగెల్సు ఇంగ్లీష్ భాషలో చేసిన ప్రసంగం. దీనికి తెలుగు అనువాదం: నిడమర్తి ఉమా రాజేశ్వరరావు ,కార్ల్ మార్క్స్, ఎంగెల్సు సంకలిత రచనలు 3 భాగం నుండి సేకరణ. ]

ఒక్కసారి వెనక్కి తిరిగి చుస్తే, 15 నెలల వ్యవధిలోనే ఎంగెల్సు, మార్క్స్ కుటుంబంలో జెన్నీ, జెన్నీ చెన్, ఇప్పుడు మార్క్స్ మొత్తం ముగ్గురికి ఆత్మీయ సందేశాలు చదివాడు. ఇంకా విచిత్రం ఏమిటంటే, మార్క్స్అంతిమ యాత్రలో పాల్గొన్నది కేవలం 11 మంది మాత్రమే. ఎంగెల్సు, హెలెన్, మార్క్స్ ఇద్దరు కూతుర్లూ, అల్లుళ్ళూ కాక మిత్రులు కేవలం 5,6 గురు మాత్రమే. అయితే, మార్క్స్ కి వేల సంఖ్యలో అభిమానులూ, అనుచరులూ వున్నారు కదా! వాళ్ళంతా ఎందుకు రాలేదు?

మార్క్స్ యొక్క మరణ వార్త ప్రజల్లోకి వెళ్ళడంలో చిన్న గందరగోళం జరిగింది. ఆయన చనిపోయిన రెండు రోజులకి 'రాయటర్ వార్తా సంస్థ 'వాళ్ళు "కార్ల్ మార్క్స్ చనిపోయాడని" చెప్పారు గానీ, "ఆయన ఫ్రాన్సులో వాళ్ళ అమ్మాయి దగ్గర చనిపోయాడని" చెప్పారు. మార్క్స్ వాళ్ళ అమ్మాయి దగ్గరకు వెళ్ళిరావడం, అలాగే లండన్ లో లేకుండా, అల్జీరియాకీ, ఐ హైట్ కీ వెళ్ళడం. వీటన్నిటితోటీ లండన్ లోనే చనిపోయాడనే సమాచారం సరిగ్గా అందలేదు. వాళ్ళు అంటే 'రాయటర్ వార్తా సంస్థ 'వాళ్ళు అలా ప్రటించిన మరో రెండు రోజులకి ఫ్రాన్సు పేపర్లు రాశాయి. "కార్ల్ మార్క్స్ ఫ్రాన్సులో మరణించలేదు. లండన్ లోనే మరణించాడని "

ఈ గందరగోళం తోటి అనుచరులకీ, కార్యకర్తలకి తెలిసేసరికి 4,5 రోజులు పట్టింది. అప్పటికే మార్క్స్ ఖననం పూర్తయిపోయింది. తర్వాత మార్క్స్ అభిమానులూ, అనుచరులూ లండన్ లోని మార్క్స్ ఇంటికి తండోపతండాలుగా వచ్చారు. విషయం తెలుసుకొని నిరాశతో వెళ్ళిపోయారు. ఎంత మంది వచ్చారంటే, పోలీసులు వచ్చి, ఇంటి చుట్టూ కాపలా కాసారట. అసలు పోలీసులు రావడానికి కారణం, ఎంగెల్సు తరవాత ఒక మిత్రుడికి రాసిన వుత్తరంలో ఏం రాశాడంటే..."పోలీసులు మేమేదో బాంబులు తయారు చేస్తున్నామని అనుకొని, ఇంటి చుట్టూ పహారా కాశారు. నిజానికి మేము విస్కీ తాగుతూ మార్క్స్ జ్ఞాపకాల్ని మననం చేసుకుంటున్నాము " అని రాశాడు.

అలా మార్క్స్ అంత్యక్రియలు జరిగిన ఒక వారం లోపే, మార్క్స్ ఇంటి నుండి మరొక మ్రుతదేహం శ్మశానవాటికకు చేరుకోవడం మరొక విషాదం. అదెలా జరిగిందంటే..మార్క్స్ పెద్దమ్మాయి చెన్ అంత క్రితమే చనిపోయిందనీ, ఆమెకు మానసికంగా ఎదగని కొడుకు కూడా ఉన్నాడనీ, ఆ కుర్రవాడిని మార్క్స్ మూడవ కూతురు తీసుకువెళ్లిందనీ గతం లోనే తెలుసుకున్నాం కదా! ఆ కుర్రవాడు మార్క్స్ మరణించిన 4 రోజులకి మరణించాడు. అతన్ని కూడా అక్కడే సమాధి చేశారు. ఆ హైగేట్ శ్మశానవాటిక లో మార్క్స్ కుటుంబ సభ్యులు నలుగురు శాశ్వత విశ్రాంతి

తీసుకుతున్నారు. మరొక 7 ఏళ్ళకి ఇంకో ఆత్మీయురాలు అదే ప్రదేశంలో శాశ్వత నిద్ర తీసుకోవడానికి వెళ్ళింది. ఆమె ఎవరో ఏమిటో తర్వాత తెలుసుకుందాం.

ఇవన్నీ సర్దుకున్నాక ఎంగెల్సు , మార్క్సు రాస్తున్నటువంటి పేపర్లు ఇంకా ఏమేమి వున్నాయోనని చూశాడు. చాలా ఆశ్చర్య పడ్డాడు. వేలాది పేపర్లు మాన్యు స్క్రిప్ట్ లు వున్నాయి. అందులో కేపిటల్ –2, 3, 4 వాల్యూం స్క్రిప్ట్ లు దాదాపు పూర్తయ్యే దశలో వున్నాయి. మార్క్సు దగ్గర ఎప్పుడూ, దాదాపు పూర్తవ్వడమే, పూర్తవ్వడం ఉండేది కాదు. పబ్లిషర్ అడుగుతుంటే, "అయిపోతుందీ...అయిపోతుందీ..." అనడమే గానీ, "అయిపోయింది "అనడం ఎప్పుడూ లేదు. ఎందుకంటే, "అయిపోయింది" అంటే, పబ్లిషర్లు ఎగరేసుకు పోవడానికి సిద్ధంగా వున్నారు. పైగా, తనకి తృప్తిగా వచ్చే వరకూ దాన్ని బయటకు ఇచ్చేవాడు కాదు. అందుకనే రాబోయే కేపిటల్ వాల్యూమ్స్ అలా ఇంట్లోనే ఉండిపోయాయి.

మార్క్సు మిత్రులందరూ అన్ని వేల ప్రతుల్ని చూసి చాలా ఆశ్చర్యపోయారు. ఎంగెల్సు తరచూ మార్క్సు తో చర్చల్లో పాల్గొనేవాడు. అయినా, ఆయనకే ఆశ్చర్యం వేసింది. ఇన్ని వేల పేజీలు ఎప్పుడు రాశాడా? అని. డజన్ల నోట్ బుక్కుల్లో ఇవన్నీ వున్నాయన్నమాట. వీటన్నటినీ సంస్కరించి, పూర్తి చేసి, కేపిటల్ వాల్యూమ్స్ ని పూర్తి చేయగల సమర్ధతా, మార్క్సు యొక్క ఆలోచనల్ని అర్ధం చేసుకోగల స్థాయీ, శక్తీ వున్నవాడు ఎంగెల్సు ఒక్కడే. మార్క్సు పిల్లలకు ఆయన "ఈ పుస్తకాలన్నీ చూసి, పరిష్కరించి, పబ్లిష్ చేయిస్తాను." అని చెప్పాడు. ఆరోజు నుండి ఎంగెల్సు లోకి మార్క్సు ఆత్మ ప్రవేశించిందని అనుకోవచ్చు. అంతకు ముందు మార్క్సు ఎలా అయితే, ఎప్పుడూ పేపర్లు రాయడం, పరిశోధనలు చెయ్యడం వాటిల్లో ఎలా మునిగి ఉండేవాడో సరిగ్గా అదే స్థితి లోకి వెళ్ళాడు ఎంగెల్సు.

అదలా వుంటే, అంత వరకూ మార్కెట్లోకి వెళ్ళిన పుస్తకాల మీద రాయితీ వచ్చేది కదా! ఆ పారితోషికాన్నంతటినీ కూడా మూడు సమన భాగాలుగా చేశాడు. ఒక భాగం రెండో అమ్మాయికీ, ఒక భాగం మూడో అమ్మాయికీ, ఒక భాగం పెద్దమ్మాయి పిల్లలకీ చెందేటట్లు ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశాడు ఎంగెల్సు. ఇలా 1883 గడిచింది.

1884 మర్చి 14 న మార్క్సు మొదటి వర్ధంతి వచ్చింది. ఈ వర్ధంతికి వివిధ దేశాల నుండి ఆరు వేల మంది కార్యకర్తలూ, కార్మిక సంఘాల ప్రతినిధులూ, అభిమానులూ వచ్చారు. మరి, మార్క్సు చనిపోయినపుడు వార్త సరైన సమయానికి అందక, కేవలం 11 మందే వున్నారు. వీళ్ళందరూ మార్క్సు, లండన్ వచ్చే కొత్తలో ఉన్నటు వంటి 'సోహో' ప్రాంతం నుండి 'హైగేట్' శ్మశానవాటిక వరకూ ఊరేగింపుగా వెళ్లారు. ఇంత మంది ఒక్కసారి శ్మశానం లోనికి వెళ్తే తొక్కిసలాట అవుతుందని భావించి, బ్రిటీష్ ప్రభుత్వం అయిదు వందల మంది పోలీసుల్ని నియమించింది భద్రత కోసం.

ఏదో కొద్ది మాత్రమే శ్మశానం లోనికి వెళ్లారు. మిగిలిన వాళ్ళంతా దగ్గరే ఒక పార్క్ వుంటే, అక్కడ సమావేశం అయ్యారు. అక్కడే మార్క్సు జ్ఞాపకాల్ని నెమరు వేసుకున్నారు. ఆయన సిద్ధాంతాలని మళ్ళీ ఒకసారి గుర్తుచేసుకుంటూ, "ఆయన ఆశించిన ఆశయాలకు మనమందరమూ పునరంకితం కావాలని " అందరూ తీర్మానించుకున్నారు. ఇలా

మార్క్స్ వర్ధంతి అయిపోయిన కొద్ది రోజులకి గత 8 సంవత్సరాలుగా ఉంటున్న ఇంటిని ఖాళీ చేయించాడు ఎంగెల్సు. మార్క్స్ పుస్తకాలూ, రాత ప్రతులూ అన్ని కూడా తనతో పాటూ తన ఇంటికి తీసుకువెళ్ళాడు. మార్క్స్ ఏ పడక కుర్చీలో కూర్చొని చనిపోయాడో, ఆ కుర్చీని తనతో పాటు తీసుకువెళ్ళాడు. మార్క్స్ గుర్తుగా తన రీడింగ్ రూములో పెట్టుకున్నాడు. ఇక మార్క్స్ కు సంబందించిన వస్తువులూ, చిన్న చిన్న పుస్తకాలూ మార్క్స్ జ్ఞాపకార్థం కొంతమంది మిత్రులు తీసుకెళ్ళారు.

గత 38 సంవత్సరాలుగా మార్క్స్ కుటుంబాన్నే నమ్ముకున్న వ్యక్తి హెలెన్ వుంది కదా! మరి ఆమె ఎక్కడకి వెళుతుంది? ఎంగెల్సు దగ్గరకు వెళ్ళింది. అతను కూడా అప్పటికి ఒక్కడే ఉంటున్నాడు. 64 వయసులో ఈ పుస్తకాలన్ని రాస్తున్నాడు. అతనికి సహాయం కావాలి. ఇంటి వ్యవహారాలన్నీ చూసుకోవాలి. ఎంగెల్సు కేవలం పుస్తకాలు రాయడమే కాకుండా, మార్క్స్ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచాడు. ఇది ఎంగెల్సుకి కొత్త కాదు. గతంలో కూడా ఎంగెల్సే పెద్దగా నిలిచాడు. మార్క్స్ చనిపోయాక తండ్రి స్థానంలోకి వచ్చాడని అనుకోవచ్చు. మార్క్స్ రెండో కూతురూ, రెండో అల్లుడూ ఫ్రాన్సులోనే వున్నారు. మూడవ అమ్మాయి ఎలినార్ లండన్ లోనే వుంది. మిగిలిన చెన్ పిల్లలు ఎవరికి, ఏ అవసరం వచ్చినా ఎంగెల్సు దగ్గరకే వచ్చేవారు.

తరువాత కథలోకి ప్రవేశించే ముందు మూడవ అమ్మాయి ఎలినార్ జీవితంలో జరిగిన ప్రధానమైన మార్పుని గురించి తెలుసుకుందాం. ఆమె టీచర్ గా వుద్యోగం చేస్తున్నది. అలాగే యునియన్ కార్యక్రమాల్లో తిరుగుతూ, థియేటర్ నాటకాల్లో కూడా వేస్తుండేది అనుకున్నాం కదా! అలాంటి క్రమంలో " ఎడ్వర్డ్ ఎవిలింగ్ " అని వ్యక్తి పరిచయం అయ్యాడు. ఈ పేరుని కుదించి 'ఎవిలింగ్' అందాం. అక్కడ 'బ్రిటీష్ లైబ్రరీ' లో షేక్స్పియర్ నాటకాలు చదివే గ్రూప్ ఒకటి వుండేది. ఆ గ్రూప్ లోకి ఎలినార్ కూడా వెళ్ళేది. అలా వెళ్ళేటప్పుడు 'ఎవిలింగ్' పరిచయం అయ్యాడు. ఇతను, ఎలినార్ కంటే,4,5 సంవత్సరాలు మాత్రమే పెద్దవాడు. జువాలజీ ప్రొఫెసర్ గా పని చేస్తుండేవాడు.

ఎలినార్ లాగే యునియన్ కార్యక్రమాల్లో తిరగడం, నాటకాలు వెయ్యడం,నాటకాలు రాయడం వాటిల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఈ అభిరుచులు కలవడంతో ఎవిలింగ్, ఎలినార్ లకు స్నేహం అయింది. ఇద్దరూ బాగా దగ్గరయ్యారు. కాకపోతే, ఈ ఎవిలింగ్ అందరి లాంటి మనిషి కాదు. ప్రత్యేకమైన వ్యక్తి. ఎలాగంటే...అతనికి పది సంవత్సరాల క్రిందటే పెళ్లయింది. కాకపోతే, పెళ్ళయిన రెండేళ్లకే వాళ్ళిద్దరూ విడిపోయారు. కానీ, విడాకులు తీసుకోలేదు. నిజానికి ఇంగ్లాడు లో 1857 లోనే చట్టబద్ధంగా విడిపోవడానికి 'విడాకుల చట్టం ' వచ్చింది. అయినా, ఎవిలింగ్ కావాలనే విడాకులు తీసుకోలేదు. ఎందుకంటే, అతను వివాహం చేసుకున్న అమ్మాయి చాలా ధవవంతురాలు. అప్పుడు ఉన్నటు వంటి చట్టం ప్రకారం భార్యా, భర్తా విడిగా ఉన్నప్పటికీ, ఇద్దరిలో ఎవరు చనిపోయినా రెండో వారికి ఆస్తంతా చెందుతుంది.

"అందుకని, భార్య చనిపోతే, ఆస్తంతా తనకి వస్తుందని ఎవిలింగ్ కావాలని విడాకులు ఇవ్వలేదు." అని అంటుంటారు. అంతేకాదు, ఎవిలింగ్ చాలా స్త్రీ లోలుడు. "ఏ అమ్మయినైనా వల్లో వేసుకోగలడు" అని ఒక ప్రచారం కూడా వుండేది. ఇక ఎలినార్ విషయం, ఎవిలింగ్ తన భార్యకు విడాకులు ఇవ్వలేదు కాబట్టీ, అతన్ని వివాహం చేసుకోవడం కుదరదు. కాబట్టి, అతనితో కొన్నాళ్ళు స్నేహం వున్న, తరువాత కలసి ఉండడానికి నిర్ణయం చేసుకుంది. ఈ విషయాన్ని ఎంగెల్సుకు చెప్పింది. మరి మార్క్సు జీవించి వుంటే, ఏమనేవాడో గానీ, ఎంగెల్సు కాదనలేకపోయాడు. ఎందుకంటే, అతను కూడా కొన్ని దశాబ్దాల పాటు, ఇద్దరితో సహజీవనం చేశాడు. అందుకని "వద్దు" అనలేకపోయాడు.

ఆ విధంగా మార్క్సు చనిపోయిన సంవత్సరంన్నర కాలంలో 1884 ప్రాంతాలలో, ఎలినార్, ఎవిలింగ్ లు అనధికారంగా కొత్త కాపురం ప్రారంభించారు. 1885 వచ్చింది. మార్క్సు మరణించి రెండు సంవత్సరాలు కావస్తోంది. ఎంగెల్సు ఈ రెండు సంవత్సరాలూ మార్క్సు పుస్తకాల మీదే పనిచేస్తున్నాడు. కేపిటల్-2 వ భాగాన్ని ఒక రూపం తీసుకురావడానికి రెండేళ్ళు పట్టింది. మార్క్సు ఆలోచనా విధానాన్ని సరైన రీతిలో అర్థం చేసుకోగలిగేది ఎంగెల్సు ఒక్కడే. ఎంగెల్సు 64 ఏళ్ళ వయసే అయినా 2o ఏళ్ళ కుర్రవాడిలాగా ఆలోచిస్తుండేవాడు. పైగా అనారోగ్యం అంటే ఏమిటో తెలియదు. కాకపోతే, మార్క్సు రాసిన కేపిటల్-2 లో కూడా లెక్కలూ, ఫార్మలాలూ కూడా వున్నాయి. వాటిని అర్థం చేసుకోవడానికి చాలా శ్రమ పడాల్సివచ్చింది. మార్క్సు కైతే, ఈ 'డిఫరెన్షియల్ కాలిక్యులేషన్ "అనే సబ్జక్ట్ అయితే, కథల పుస్తకం చదివినంత సులువుగా వుండేది. ఎంగెల్సు మాత్రం ఈ లెక్కల్లో అంత పట్టు వున్నవాడు కాదు. ఎలాగో వీటన్నిటినీ అధికమించి,1885 జనవరి మొదట్లో కేపిటల్-2 ని ప్రచురణకు సిద్ధం చేశాడు. తరువాత 3,4 భాగాలు ఎలా ప్రచురణకు వెళ్ళాయి? ఇంకా మార్క్సు కు సంబంధించి ప్రధాన పాత్రలు వున్నాయి. అవేమిటో కూడా తెలుసుకుందాం.

**(ముగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 డిసెంబర్ 16 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS